# తత్త్వం

-దూరి వెంకటరావు

"నాకు తెలీక అడుగుతాను నీ భార్యకి రెండు కొమ్ము లున్నాయా? లేకపోతే ఆకాశం మీంచి గాని ఊడి పడిందా?" అడిగాడు సురేంద్ర.

"ఇంతకీ ఏమైంది" అన్నాడు సుబ్బారావు అసహనంగా.

"నీతో నాకున్న స్నేహాన్ని పురస్కరించుకుని అడుగు తున్నాను. మా ఆవిడ మీ ఇంటికెళితే మీ శ్రీమతి కిటికీలో నుంచే సమాధానం ఇచ్చి పంపేసిందట. లోపలకు పిలిచి మాట్లాడితే ఏం పోయింది?"

"సారి సురేంద్రా. దాని తత్త్వమే అంత ఏమి చేయమంటావ్? ఆవిడ తరఫున నేను అపాలజీ కోరుకుంటున్నాను సరేనా." సురేంద్ర చేతులు పట్టుకున్నాడు సుబ్బారావు.

మరి మాట్లాడలేదు సురేంద్ర.

❍ ❍ ❍

అది ఆదర్శనగర్. పేరుకు తగ్గట్టుగానే కాలనీ లన్నింటిలో ఆదర్శమైంది. ఒకరి కష్టంలో మరొకరు పాలు పంచుకుంటూ ఎన్నాళ్ళ నుంచో ఆ కాలనీ వాసులంతా ఎంతో ఐకమత్యంగా ఒకే కుటుంబ సభ్యుల్లా మెలుగుతున్నారు. గత కొన్నేళ్ళుగా సుబ్బారావు ఆ కాలనీలో ఒంటరిగా ఉంటున్నా ఒంటరితనం ఫీల్ కాలేదంటే అందుకు కారణం అక్కడివారి కలుపుగోలు తనమే. ఈ మధ్యే జెమ్‌షెడ్‌పూర్ వెళ్ళి తన కుటుంబాన్ని తీసుకొచ్చాడు.

సుబ్బారావు భార్య వచ్చిందన్న వార్త కాలనీలో గుప్పుమనడంతో మహిళలంతా మూకుమ్మడిగా అతడి ఇంటి మీదకు దాడిచేశారు.

వచ్చిన వాళ్ళందరికీ టీ కలిపిచ్చింది రుక్మిణి.

"మా రుక్మిణమ్మ సాక్షాత్తు రుక్మిణీదేవే. అందాల రాశి. అపరంజి బొమ్మ" అంటూ ఆమెను తెగ పొగిడి వెళ్ళిపోయారు.

"ఏమిటండి ఇది. వచ్చీ రాగానే జూలోని జంతువుని చూడ్డానికొచ్చినట్టు వీళ్ళంతా..." ముఖం చిట్లించింది రుక్మిణి.

"ఆ మాత్రానికే ఆగ్రహిస్తే ఎలా డియర్. మీ వాళ్ళు నీకు పొరపాటున రుక్మిణి అని పేరుపెట్టారు. సత్యభామ అని పెట్టుంటే సరిగ్గా సూటయ్యేది" అన్నాడు సుబ్బా రావు నవ్వుతూ.

"చాల్లెండి పరిహాసం. మీరేమనుకున్నా నన్ను చూడటం కోసం అంతా ఒక్కసారి ఇలా కట్టకట్టుకుని రావడం నాకు నచ్చలేదు"

"నువ్వీ కాలనీలో కొత్తగా అడుగుపెట్టావు కదా! పైగా నా భార్యవి. ఎలా ఉంటుందోనన్న ఆదుర్దాతో వచ్చారు. నా కంటే నువ్వు నయం. ఇలా వచ్చావో లేదో అందరి మన్ననల్ని పొందావు" మందహాసం చేశాడు సుబ్బారావు.

"వాళ్ళ పొగడ్తలేం నాకక్కర్లేదు. నన్నిలా ఉండనిస్తే చాలు" రుసరుసలాడుతూ అక్కడనుంచి వెళ్ళిపోయింది రుక్మిణి.

అర్ధాంగి నైజాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలీడం లేదు సుబ్బారావుకి. ఏదో చిన్న జాబ్ చేస్తుండడం వల్ల పెళ్ళైన నాటి నుంచి ఇంతవరకు పుట్టింట్లోనే ఉండిపోయింది. తనే సెలవుల్లో అక్కడికి వెళ్ళొస్తుండే వాడు. మళ్ళీ ఇన్నాళ్ళకి ఉద్యోగానికి రిజైన్ చేసి వచ్చేసింది. ఆమెతో కలిసి కాపురం చెయ్యడం ఇదే ప్రథమం.

అంటీ ముట్టనట్లుండే ఆమె స్వభావం కలివిడిగా తిరిగే కాలనీవాసులెవ్వరికీ కొరుకుడు పడడం లేదు.

భార్య సినిమా ప్రపోజలు పెట్టడంతో ఆ రోజు ఆఫీసు నుంచి పెందలాడే ఇంటికొచ్చాడు సుబ్బారావు.

అప్పటికే సింగారించుకుని సిద్ధంగా ఉంది రుక్మిణి.

"ఇక్కడివాళ్ళ ధోరణేమీ నాకు నచ్చడంలేదు" అంది రుక్మిణి భర్తకు కాఫీ కప్పు అందిస్తూ.

"మళ్ళీ ఏమైంది" అడిగాడు అసహనంగా.

"వదినగారూ, వంట అయిపోయిందా? అన్నయ్య గారింకా ఆఫీసు నుంచి రాలేదా? ఇలా నేనేదో తీరిగ్గా కూర్చున్నట్టు సవాలక్ష పలకరింపులు. నాకీ వరసలంటే వళ్ళు మంట. ఇవాళ తెగేసి చెప్పేశానులెండి. పిలవ వలసి వస్తే పేరు పెట్టి పిలవండని"

భార్య ధోరణికి మతిపోయింది సుబ్బారావుకి. "చూడు రుక్కూ వరసలు పెట్టి పిలుచుకోవడంలో తప్పులేదు. అలా పిలవడం వల్ల మనలో ఆత్మీయతా భావన అలవడుతుంది. ఒకే కుటుంబ సభ్యులమన్న భావం కలుగుతుంది. ఫలితంగా ఒకరికొకరం చేదోడు

వాదోడుగా ఉండగలుగుతాం. అందువల్లే సాధారణంగా సన్నిహితుల్ని పేర్లు పెట్టి పిలుచుకోరు" వివరణ ఇచ్చాడు సుబ్బారావు.

"మీరెన్ని చెప్పండి, నాకలా వరసలు పెట్టి పిలిస్తే ఇష్టం ఉండదు. అలా అని వాళ్ళ మీద నాకు కోపం లేదు సుమండి"

"సరేలే, ఇంతకీ మోహన్ ఏడీ?" మాట మార్చాడు సుబ్బారావు.

"అడుగో.. బూట్లు తొడుక్కుంటున్నాడు"

పిల్లిలా నెమ్మదిగా చడీచప్పుడు కాకుండా వెనక నుంచి వెళ్ళి మోహన్‌బాబు కళ్ళు మూసాడు సుబ్బారావు.

"డాడీ" అంటూ చేతులు విప్పాడు మోహన్.

ముగ్గురూ మోటారు బైకు ఎక్కారు.

బండి శబ్దమవడంతో పొరుగున వున్న మాధవరావు దంపతులు బయటకొచ్చారు.

"సినిమాకెళుతున్నాం" నవ్వుతూ అన్నాడు సుబ్బారావు.

"మయూరి థియేటర్‌కెళ్ళండి" సలహా ఇచ్చాడు మాధవరావు.

"అలాగే"

"వద్దు. లీలామహల్‌కి వెళ్ళండి. దాంట్లో బొమ్మరిల్లు ఆడుతోంది. చాలా బావుంటుంది" అన్నది మాలతి.

అన్నిటికి 'అలాగే' అనడం సుబ్బారావు వంతైంది.

"మీకసలు బుద్ధిలేదు. మనం ఎక్కడికెళుతున్నామో అందరికీ విన్నవించుకోవాలా?" అంటూ దారిలో మండిపడ్డది రుక్మిణి.

"అన్నిటికీ కోపమైతే ఎలా డియర్. చూస్తూ మాట్లాడకుండా వెళ్ళిపోతే ఏం బావుంటుంది చెప్పు"

పెనిమిటి మాటలు రుక్మిణికి రుచించినట్లు లేదు. అందుకేనేమో సినిమా హాలుకెళ్ళేంత వరకు మరి నోరు మెదపలేదు.

అవేళ ఆదివారం.

ఆఫీసుకు సెలవు కావడం వల్ల ఇంట్లోనే కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు సుబ్బారావు.

హాల్లో తీరిగ్గా కూర్చుని చీరకు ఫాలు కుడుతోంది రుక్మిణి.

"మమ్మీ... మమ్మీ... కిరణ్ అంకుల్ ఇంటి దగ్గర బోలెడంత మంది ఉన్నారు" అన్నాడు మోహన్‌బాబు పరుగెత్తుకుంటూ వచ్చి.

"నీకెన్నిసార్లు చెప్పాలి, వాడిని అంకుల్ అని పిలవవద్దని. టాటాలో ఉన్నాడే మా తమ్ముడు గిరిధర్ వాడే నీ అంకుల్. ఇంకెవర్నీ అలా పిలవకు" కొడుకును మందలించింది రుక్మిణి.

కిరణ్ పేరు చెవుల్లో పడటంతో గభాలున లేచి నిలబడ్డాడు సుబ్బారావు. నిన్న వాడికి ఒంట్లో బాగోలేక పోతే తనే దగ్గరుండి ఆస్పత్రికి తీసుకెళ్ళాడు. ఇప్పుడెలా వుందో ఏమిటో! కీడును శంకిస్తోందతడి మనసు.

అంతలోనే కిరణ్ గుండెపోటుతో మరణించాడన్న కబురు మోసుకొచ్చారు కాలనీవాసులు.

ఆ వార్తకు షాకయ్యాడు సుబ్బారావు. మరుక్షణం తేరుకుని, "రుక్కూ! పాపం కిరణ్ పోయాడట" అన్నాడు

## భాషకు అవతల

**తి**లిసిమాత్ కి రాత్!
అక్షరాల గారడీలో
ఎంతయినా పలకొచ్చు
చుక్కలు కుట్టిన ఆకాశాన్ని
మడతపెట్టి కప్పుకోవచ్చు
ఇంద్రధనుస్సును బంతిపూల దండగా
గుమ్మానికి కట్టుకోవచ్చు
మాటలు వొట్టి మాయాజాలం
శరీర భాష ముందు
వెలవెలబోతాయి
కంటి చూపు / పెదవి విరుపు
నుదుటి వెక్కిరింత / చేతుల కదలిక
ఈ అప్రయత్న అభివ్యక్తిలో
నువ్వు దొరికిపోతావు.
శరీర భాషకు
కాలమూ కొలమానమూ వుంటాయి
నిద్ర మెలకువ ఆకలీ
అన్నీ కర్తవ్య పాలనలో ఒదిగిపోతాయి
శరీరానికి / ఓ మనస్సూ తప్పదు కదా
రెండూ దోబూచులాడుతాయి
భాషాతీత / కాలాతీత
దేహాతీత ధ్యానంలో పడిపోతాను
ఇప్పుడిక ప్రకాశించేది
ఆత్మే!
సూర్యోదయంలా

**-ఎన్. అరుణ**

## తిరిగి రాని కవిత

అయ్యా! భూషణ్‌గారూ!/మీరెంతో అదృష్టవంతులు
మీ కవిత తిరిగన్నా వచ్చింది
అందుకు సంతోషించండి.
తిరిగి రాని కవితలు ఎందరివి ఎన్నో, ఎన్నెన్నో
వారంతా వాటి సృష్టికి మీలాగే
ఎంతటి పురిటినొప్పులు పొందారో?
పిల్లలగన్న తల్లికే పురిటి బాధ తెలుస్తుంది
గొడ్రాలికి ఏమి తెలుసు కనటంలో కష్టసుఖాలు
కన్నబిడ్డను ఇరుగు పొరుగుకు
చూపుతాము కదా! బాగున్నా, లేకపోయినా
బాగంటే సంతోషిస్తాం / ఓగంటే సంతాపిస్తాం.
కాలం మారలేదు, ఎప్పటిలాగే ఉంది
మనిషే మారాడు, సంస్కృతే మారింది
సృష్టి ఒక మధురానుభూతి
సృష్టి భావన అందరిలోనూ ఉంటుంది
నిద్రాణంగానో! సద్రాణంగానో
అయితే కలిసొచ్చిన కొందరే సృష్టించగలరు
కొందరు గొప్పగా, మరికొందరు చప్పగా
కవిత రాయడం ఒక తపన/పిల్లల కొరకు పడే తపనలా
కొందరు కనరనుకోండి. కొనడమే తప్ప
కవితల సైజుపై, విషయంపై, రూపంపై కూడ
పత్రికాధిపతుల పరిమితులు
వారికి మార్కెటయ్యే విధంగా రాస్తేనే
ప్రచురణ. పారితోషికమా? మీ ప్రాప్తం
ఒకనాటి పత్రికాధిపతులు, సంపాదకులు
రచయితల రచనల్లోని లోపాలని ఎత్తిచూపి
ఎలా సవరించుకోవాలో చెపుతూ త్రిప్పి పంపేవారు
ఇప్పుడు కవితలు తిరిగొస్తున్నాయా?
సెల్ఫ్ అడ్రస్డ్ కవర్లే మాయమవుతుంటే
నేడు సాహిత్యం, పత్రికా రంగం
ప్రధాన వ్యాపార కేంద్రాలయ్యాయి
సాహిత్యం కోసం పెట్టిన, పుట్టిన పత్రికలు కాలం చేశాయి
ఈ చిన్ని 'పత్రిక'లాంటి ఒకటో రెండో తప్ప
నేడు అంతా వ్యాపారమయమే. సందేహం లేదు
తిరిగి రాక, చెత్త కట్టలో చేరిన కవితా కూనలకు
ఇవే అశ్రువాంజలులు.

(మే సంచికలో ప్రచురించిన 'తిరిగొచ్చిన కవిత' చదివాక)

**-వి. యల్. ప్రసాదరావు**

గబగబా షర్టు తొడుక్కుంటూ.

ఆ మాటకు మ్రాన్పడిపోయింది రుక్మిణి.

ఆమె సమాధానం కోసం చూడకుండా రివ్వున బయటకు వెళ్ళిపోయాడు సుబ్బారావు.

రుక్మిణి మనస్తత్వం కాలనీవాసులెవ్వరికి మింగుడు పడడంలేదు. తలొకరు తలోరకంగా చెవులు కొరుక్కో సాగారు. అవి తన చెవిలో కూడా పడటంతో బాధ పడటం మినహా అర్థాంగినేమీ అనలేకపోతున్నాడు సుబ్బారావు.

భర్త మరణంతో విద్యావతి బ్రతుకు ప్రశ్నార్థకమైంది. ఇకపై తన పిల్లలిద్దర్నీ ఎలా సాకాలో తెలీడం లేదు. కిరణ్‌ది ప్రభుత్వోద్యోగం కానందున తగినంత ఆర్థిక సహాయం అందే అవకాశం లేదు.

"కిరణ్ కుటుంబాన్ని ఆదుకునే నిమిత్తం అతడి భార్యకు తక్షణ సహాయంగా కొంత మొత్తాన్ని వసూలుచేసి ఇవ్వాలని కాలనీ కమిటీ తీర్మానించింది. నీ వంతు మూడొందలు" అన్నాడు సురేంద్ర ఆఫీసులో సుబ్బారావు సీటు వద్దకొచ్చి.

అతడి మాట పూర్తికాకుండానే జేబులోంచి మూడు వంద కాగితాలు తీసిచ్చాడు సుబ్బారావు.

ఆ సాయంత్రం ఆరు గంటలకు కిరణ్ సంతాప సభ ఏర్పాటు చేశారు.

కాలనీవాసులంతా చేరారు.

సుబ్బారావు ఒంటరిగా వెళ్ళాడు.

రుక్మిణి రానందుకు ఆమెనంతా రకరకాలుగా అనుకోవడం తన చెవిని పడడంతో అతడి మనస్సు చివుక్కుమంది. తప్పంతా తనదే రుక్కును కూడా పిలవవలసింది. రమ్మంటే వచ్చి ఉండేది. ఆమెతో చెప్పకుండా తనొక్కడు ఇలా రావడం పొరపాటే అనుకున్నాడు.

"మన సోదరుడు కిరణ్ ఆకస్మిక మృతికి సంతాప సూచకంగా లేచి నిలబడి రెండు నిమిషాలు మౌనం పాటిద్దాం. అతని ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థిద్దాం" అన్నారు కమిటీ కార్యదర్శి.

అంతా లేచి నిలబడ్డారు.

మౌనానంతరం సభాధ్యక్షుడు కిరణ్ గుణగణాల్ని కొనియాడారు. తదనంతరం కాలనీవాసులు ఒక్కొక్కరు వేదిక మీదకొచ్చి కిరణ్ మంచితనాన్ని వేనోళ్ళ కొనియాడారు.

"కిరణ్ కుటుంబాన్ని ఆదుకోవడం కోసం మనం పోగుచేసిన సొమ్ము యాభై వేలయింది. అందుకు మీ

అందరికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ సందర్భంగా మరో ముఖ్యమైన విషయం- ఓ అజ్ఞాత అభిమాని పాతికవేలు విరాళమివ్వడంతో ఈ మొత్తం డెబ్బై ఐదువేలకు చేరుకుంది. ఆ వ్యక్తి తన పేరును ఎక్కడా ఉచ్చరించవద్దని వేడుకుంది. అయినా నా మనసు ఉండబట్టక చెప్పేస్తున్నాను. ఆ మహామనీషి ఎవరో కాదు. మన సుబ్బారావు గారి సతీమణి రుక్మిణమ్మగారు"

కార్యదర్శి ప్రకటన పూర్తి కాకుండానే సభలో చప్పట్లు మారుమోగాయి.

అమితాశ్చర్యపోయాడు సుబ్బారావు.

''ఇది నిజమా?!..'' అన్నట్లు మహిళలలో కలకలం.

"దయచేసి సభికులంతా నిశ్శబ్దంగా ఉండాలి. ఇప్పుడీ డెబ్బైఐదువేల రూపాయలు రుక్మిణిగారి చేతుల మీదుగా దివంగత కిరణ్‌గారి సతీమణి విద్యావతి గారికి అందజేస్తాం" అన్నాడు అధ్యక్షుడు. అయితే ఆమె సభలో లేరని గ్రహించి "క్షమించండి రుక్మిణిగారు ప్రస్తుతం మనకు అందుబాటులో లేనందున ఆమె భర్త సుబ్బారావు గారొచ్చి ఈ మొత్తాన్ని విద్యావతి గారికి అందజేస్తారు" అన్నాడు.

కళ్ళు వత్తుకుంటూ విద్యావతి వేదిక మీదకు రావడంతోనే సుబ్బారావు ఆ పైకాన్ని చప్పట్ల మధ్య ఆమెకు అందజేశాడు.

సభ ముగియగానే మహిళలంతా అతడి చుట్టూ చేరి "రుక్మిణిగారిని మేం అపార్థం చేసుకున్నాం. మమ్మల్ని మన్నించాలి. మాతో ఆవిడ రాసుకు పూసుకు తిరగకపోవడంతో ఆమెకు గర్వమనుకున్నామే తప్ప అది ఆమె తత్త్వమని తెలుసుకోలేకపోయాం. మన కాలనీవాసుల పట్ల ఆమెకున్న అభిమానం అమోఘం. మా అభిమానాన్ని మాటలతో చాటుకుంటే ఆమె తన చేతుల ద్వారా వ్యక్తం చేశారు. మా అందరి తరఫున మీరే ఆమెకు క్షమాపణ చెప్పాలి" అంటూ వేడుకున్నారు.

"సారీ సుబ్బారావ్. మీ ఆవిడ మంచి మనసును అర్థం చేసుకోలేకపోయాను. ఆమె ఉదార స్వభావాన్ని మేం ఇప్పుడే అర్థం చేసుకున్నాం. ఐ యామ్ సారి" చేతులు పట్టుకున్నాడు సురేంద్ర.

భార్య చేసిన మహోపకారానికి ఆమెనంతా ముక్త కంఠంతో పొగుడుతూ ఉంటే గర్వంగా ఫీలయ్యాడు సుబ్బారావు. ■

## గ్రంథాలయం

తిక్కన కవితలో
చెక్కిన కవిత శిల్పం
పోతన కవితలో
పొంగిన భక్తిరసం
శ్రీనాథుని కవితలో
సిరులొలికే శృంగారం
వేమన కవితలో
తేట తెలుగుదనం
శ్రీశ్రీ కవితలో
జీవిత చైతన్యం
సి.నా.రె. కవితలో
మృదు పద మధురానందం
అన్నిటినీ ఒక్కచోట
అందించే గ్రంథాలయమే
మనిషికి దేవాలయం!

## చిన్న చూపు చూడకు!

చినుకేగదా అని
చిన్న చూపు చూడకు
వర్షమై... జలమై
ప్రళయం పుట్టించగలదు

చిరుగాలే గదా అని
చిలిపి చూపు చూడకు
హోరై... దుమారమై
ప్రభంజనం సృష్టించగలదు

మౌనమే గదా అని
చిన్నచూపు చూడకు
మాటల ద్వారా వ్యక్తపరచలేని
భావాలెన్నింటినో వ్యక్తపరచగలదు

అక్షరమే గదా అని
అలుసు చేయకు
పదమై... పాఠమై
నీలో... నాలో అక్షయమై
మన అందరిలో ఆనందం కలిగిస్తుంది!

-కాళహస్తి వెంకట శేషగిరిరావు